సేవే పరమావధిగా పయనం

- ఊరికి ఉపకారం చేస్తున్న డాక్టర్ బలుసు సుబ్బారావు
- నూరేళ్ల వయసులోనూ సడలని మమకారం
- అమెరికాలో ఉన్నా.. ధ్యాసంతా అంగరపైనే
- తండ్రి పేరున ట్రస్ట్ ఏర్పాటుతో సేవా కార్యక్రమాలు
- అంగర, పడమర ఖండ్రిక గ్రామాల అభ్యున్నతికి కృషి
- నేడు పౌర సన్మానం



అంగరలో తండ్రి పేరున నిర్మించిన జెడ్పీ ఉన్నత పాఠశాల



భార్య వసుంధర జ్ఞాపకార్థం అంగర పీహెచ్‌సీ ఆవరణలో నిర్మించిన ప్రత్యేక బ్లాక్

కపిలేశ్వరపురం: ఆయనకు నూరేళ్లు... స్వదేశ, విదేశాల్లో వైద్య వృత్తిలో విశేష ప్రతిభ కనబర్చారు. సుదీర్ఘకాలం అమెరికాలో వైద్యసేవలందించారు. సుదూరాన ఉన్నా ఆయనకు సొంతూరుపైనే ధ్యాస. పుట్టి పెరిగిన స్వగ్రామంతో అనుబంధాన్ని ఏమాత్రం వదులుకోలేదు. గ్రామస్తులతో కుశల ప్రశ్నలతో సరిపెట్టుకోక అంగర, పడమర ఖండ్రిక గ్రామాల అభ్యున్నతికి సుదీర్ఘకాలంగా కృషి చేస్తూ వస్తున్నారు. ఆయా గ్రామాల మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల విద్య, వైద్య, ఆరోగ్య అవసరాలకు సాయమందిస్తున్నారు. అందుకే ఆయనంటే ఇరు గ్రామాల ప్రజలకూ మక్కువ. ఆయన పేరు డాక్టర్ బలుసు సుబ్బారావు. వందేళ్లు నిండిన ఆ నిండు చంద్రుడికి నేడు అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలకు పౌరసన్మానం చేస్తున్న నేపథ్యంలో ఈ కథనం.

డాక్టర్ సుబ్బారావు ప్రస్థానం ఇదీ..

గ్రామానికి చెందిన దాత డాక్టర్ బలుసు సుబ్బారావు 1944లో విశాఖపట్టణం ఆంధ్ర మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 1955లో మండపేటలో ప్రాక్టీస్ ప్రారంభించారు. 1972 నుంచి సుమారు 30 ఏళ్లు అమెరికాలో వైద్య వృత్తిలో స్థిరపడ్డారు. 75 ఏళ్ల వయస్సులో 2000లో అమెరికాలో వైద్య వృత్తికి స్వస్తి చెప్పారు. గత కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో వందో పుట్టినరోజును జరుపుకొన్నారు.

సేవా కార్యక్రమాలు ఇలా...

అమెరికాలో స్థిరపడినా సుబ్బారావు స్వగ్రామమైన అంగర, సమీప గ్రామమైన పడమర ఖండ్రిక గ్రామ అభ్యున్నతికి దీర్ఘకాలంగా కృషి చేస్తూ వస్తున్నారు. తండ్రి పేరున బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలను చేస్తున్నారు. ఇరు గ్రామాల ప్రయోజనార్థం 1976లో తండ్రి పేరున ఉన్నత పాఠశాల భవనాన్ని నిర్మించారు. రూ.8 లక్షలతో పాఠశాల ఆవరణలో కళావేదికను నిర్మించారు. భార్య వసుంధర 2023లో కన్నుమూశారు. ఆమె జ్ఞాపకార్థం అంగర పీహెచ్‌సీ ఆవరణలో రూ.75 లక్షలతో నిర్మించిన ప్రత్యేక బ్లాక్‌ను 2024 అక్టోబర్ 4న ప్రారంభమైంది. అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభగల విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసేందుకు రూ.2 లక్షలు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కపిలేశ్వరపురంలోని నాన్ భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల మేలు కోరి రూ.10 లక్షలు డిపాజిట్ చేశారు. పేద విద్యార్థుల చదువులకు వినియోగార్థం కపిలేశ్వరపురం మండల కాకతీయ కమ్మ సంఘానికి రూ.20 లక్షలు సమకూర్చారు. అంగర గ్రామంలోని 600 కుటుంబాలకు రూ.3 వేలు చొప్పున వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు ఆర్థికసాయం అందించారు. రూ.4 లక్షలతో తడిచెత్త, పొడి చెత్త వేరు చేసేందుకు డస్ట్‌బిన్లను సమకూర్చారు. పంచాయతీ కార్మికులకు రూ.లక్ష అందజేశారు. అంగర, పడమర ఖండ్రిక శ్మశానవాటికలో రూ.6 లక్షలతో అస్థికలు భద్రపరుచుకునే భవనం నిర్మించారు. బాడీ ఫ్రీజర్ బాక్సును సమకూర్చారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ అల్లంరాజు శ్రీనివాస్‌కుమార్ ఫౌండేషన్‌కు హార్ట్ స్పెషలైజేషన్ పరిశోధనల నిమిత్తం రూ.కోటి విరాళం అందజేశారు. బసవతారకం కేన్సర్ ఆసుపత్రి వైద్యుల ద్వారా అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో తరచూ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు.



డాక్టర్ బలుసు సుబ్బారావు, వసుంధర దంపతులు

సుబ్బారావుకు నేడు పౌర సన్మానం

డాక్టర్ బలుసు సుబ్బారావు సేవా తత్పరతను అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు అభినందిస్తున్నారు. ప్రజలంతా ఏకమై డాక్టర్ సుబ్బారావుకు నేడు అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పౌరసన్మానం చేస్తున్నారు. గ్రామంలోని తన నివాసం నుంచి పాఠశాల వరకూ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

పన్ను చెల్లింపునకు ఆదివారం సెలవు లేదు



మెయిన్‌రోడ్డు బస్టాండ్ వద్ద శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

మండపేట: మార్చి నెలాఖరుకు నూరు శాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలనే లక్ష్యంతో పురపాలక సంఘం పనిచేస్తోందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. గత నెల రోజులుగా ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించామన్నారు. ఆస్తి పన్ను వసూళ్లతో పాటు స్వచ్ఛ మండపేట కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయన్నారు. నిర్విరామంగా ఈ రెండు కార్యక్రమాలు నిర్వహిస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. శనివారం ఆయన పలు వార్డులో పర్యటించి స్వచ్ఛ మండపేట సాధన కోసం ప్రజలు పాటించాల్సిన పద్ధతులను ఆయన వివరించారు. కమిషనర్ రంగారావు మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తి పన్నులు బకాయిదారులు వెంటనే కట్టాలన్నారు. మార్చి నెలాఖరు సమీపిస్తున్నాయని ప్రజలు సహకరిస్తే లక్ష్యానికి చేరువవుతామన్నారు. పన్నుల చెల్లింపునకు ఆదివారం నాడూ మున్సిపల్ కార్యాలయంలో పన్ను కట్టించుకోవడానికి సిబ్బంది పనిచేస్తారని గుర్తు చేశారు. ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ చెల్లింపుదారులు తమ పన్నులు చెల్లించి రశీదు పొందాలని కోరారు.

క్లుప్తంగా

బాలికలు ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలి



విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న ఎస్సై జానీబాషా

కె.గంగవరం: బాలికల భద్రతకు సంబంధించి కె.గంగవరం ఎస్సై ఎస్‌కే జానీబాషా ఆధ్వర్యంలో మండల కేంద్రం కె.గంగవరంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆత్మ రక్షణ విద్య ఆవశ్యకత, స్వీయ రక్షణకు సంబంధించి టెక్నిక్‌లు కరాటే మాస్టర్ పెంద్ర బాలకృష్ణ ద్వారా అవగాహన కల్పించారు. ఏఏ సందర్భాల్లో ఏ విధంగా నడచుకోవాలో ఎస్సై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి



శీలలో రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందజేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కాజులూరు: తమ పొలంలోని భూమి సారవంతంపై రైతులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని దానికనుగుణంగా సాగు చేపట్టాలని కాకినాడ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె.మాధవి అన్నారు. శీలలో ఏవో వి.అశోక్ అధ్యక్షతన జరిగిన భూసార పరీక్షల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ రైతులు తమ పొలంలోని భూసారాన్ని పరీక్షించుకోవడం ద్వారా ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చన్నారు. తద్వారా ఖర్చుతగ్గి నికర ఆదాయం పెరగడమే కాకుండా ఆరోగ్యవంతమైన పంట ఉత్పత్తులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో శీల గ్రామ సర్పంచ్ కోమలి వెంకటరమణ, ఏఈఓ శ్రీనివాస్, రామకృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కవితల పోటీ విజేతలకు బహుమతుల అందజేత



కవితల పోటీల్లో బహుమతులందుకున్న విజేతలు

మండపేట: ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కవితల పోటీల్లో విజేతలు బహుమతులు అందుకున్నారు. అభ్యుదయ రచయితల సంఘం కోనసీమ జిల్లా శాఖ, సంగమం సాంస్కృతిక వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి కవితా పోటీలలో పలువురు విజేతలుగా నిలిచారు. కాకినాడకు చెందిన ప్రముఖ కవి సాహితీవేత్త ఆర్‌వీవీ రాజా ప్రథమ బహుమతి గెలుచుకున్నట్టు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గండి స్వామిప్రసాద్ తెలిపారు. పట్టణానికి చెందిన కవి సాంఘిక సేవా కార్యకర్త బొమ్మకంటి విజయ్‌మోహన్ ద్వితీయ బహుమతి పొందగా, తృతీయ స్థానంలో రచయిత్రి గరిమెళ్ళ శ్రీలక్ష్మి నిలిచారని శనివారం తెలిపారు. వీరిని సాహితీ తరంగిణి కార్యవర్గ సభ్యులు సవితాల సుబ్రహ్మణ్యం, సాహితీ స్రవంతి కార్యవర్గ సభ్యులు బండారు రాము తదితరులు అభినందించారు.

ముగిసిన శిక్షణ



అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీఓ

రామచంద్రపురం రూరల్: ఐసీడీఎస్ రామచంద్రపురం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల మొదటి బ్యాచ్‌కు రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. సీడీపీఓ వీవీ వరాహలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా పోషణ్ బీ-పఢాయి బీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు సరైన పోషణ ఎంత అవసరమో విద్య కూడా అంతే అవసరమని అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమం ద్వారా పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి, భావోద్వేగం, నైతిక అభివృద్ధి, సాంస్కృతిక, మాతృభాషా, కమ్యూనికేషన్‌ల అభివృద్ధి లక్ష్యంగా పనిచేసి మంచి ఫలితాలు చిన్నారుల్లో సాధించాలని సూచించారు. అదే విధంగా నవ చేతన్-ఆధార్ శీల కార్యక్రమం ద్వారా చిన్నారులకు మేలు జరిగేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.నాగమణి, ఐ.కల్యాణి, జి.సూర్యావతి, అధిక సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యల వెల్లువ



సమావేశానికి హాజరైన సభ్యులు



సమావేశంలో ప్రసంగిస్తున్న తహసీల్దార్ రవీంద్రనాథ్‌ఠాగూర్

కాజులూరు: మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సమస్యలు వెల్లువెత్తాయి. ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు వారి శాఖల తరఫున ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతిని సభ్యులకు వివరించారు. జగన్నాథగిరి ఎంపీటీసీ కొప్పన లక్ష్మి, నామవానిపాలెం, శీల, మతుకుమిల్లి, మంజేరు గ్రామాల సర్పంచ్‌లు భూపతిరాజు సూర్యనారాయణరాజు, కోమలి వెంకటరమణ, పెట్టా వీరనాయుడు, గుంటూరి అప్పారావు తదితరులు మాట్లాడుతూ మండల గ్రామాల్లో తలెత్తిన తాగునీరు, సాగునీటి సమస్య, గృహనిర్మాణాల బిల్లులపైన, రోడ్డు నిర్మాణాలపైన, విద్యుత్ లో వోల్టేజీ సమస్యలపైన ఏకరవు పెట్టారు. ఎంపీడీఓ జె.రాంబాబు, మండల తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ సభ్యుల పశ్నలకు సమాధానాలు చెప్పారు. మండల వ్యవసాయాధికారి వి.అశోక్ మాట్లాడుతూ మండలానికి 15 పవర్‌టిల్లర్లు మాత్రమే మంజూరయ్యాయని రైతులకు వాటిని అందజేసి కొత్త బడ్జెట్‌లో రైతులకు అవసరమైన యంత్రాలను ప్రతిపాదించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, బందనపూడి ఎంపీటీసీ సలాది లక్ష్మణరావు, ఒంటితాడి సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ, పల్లిపాలెం ఎంపీటీసీ శ్రీను, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి సరఫరాపై కౌన్సిల్‌లో రగడ

20కి 19 అంశాలను ఆమోదించిన సభ్యులు



కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ శ్రీదేవి, కమిషనర్ నాయుడు

రామచంద్రపురం: పట్టణంలోని పలు వార్డుల్లో రక్షిత మంచినీటి సరఫరాలో లోపాలు జరుగుతున్నాయని వాటిని వెంటనే సరిదిద్దాలని రక్షిత మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం కౌన్సిల్ హాల్‌లో శనివారం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వివిధ వార్డులకు సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనపై కౌన్సిలర్ల మధ్య చర్చ హోరాహోరీగా కొనసాగింది. తొలుత సమావేశంలో కౌన్సిలర్‌ల ముందుకు 20 అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టారు. ఒక అంశాన్ని మినహా మిగిలిన అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మొదటి అంశమైన వెల్ల ప్రాజెక్టుకు సంబంధించిన వాటర్ ట్యాంకుకు రూ.లక్షల అంచనాతో 40 హెచ్‌పి, 50 హెచ్‌పి కిర్లోస్కర్ మోటార్లను సరఫరా చేసి బిగించే అంశంపై తీర్మానాన్ని ప్రవేశపెట్టడం సభలో తీవ్ర గందరగోళం మొదలైంది. దీనిపై కౌన్సిల్ సభ్యులంతా ఏకకంఠంతో స్పందించారు. వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, కౌన్సిలర్లు వివిధ వార్డుల్లో సరఫరా అవుతున్న రక్షిత మంచినీటి సమస్యపై తీవ్రంగా స్పందించారు. వెల్ల వాటర్ ప్రాజెక్టు నుంచి మున్సిపాలిటీకి సరఫరా అవుతున్న రక్షిత మంచినీటిపై పట్టణ వాసుల నుంచి తీవ్ర అభ్యంతరాలు ఎదురవుతున్నాయని కౌన్సిల్ సభ్యులు ధ్వజమెత్తారు. డీఈ శ్రీకాంత్ మాట్లాడుతూ తాము వాటర్ ప్లాంట్‌ను ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నానని, రక్షిత మంచినీటిలో ఆక్సిజన్ తగ్గి రంగు మారినట్లు గమనించామని వివరణ ఇచ్చారు. డీఈ సమాధానంతో సంతృప్తి కానీ సభ్యులు దీనిపై తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఈ అంశంపై మున్సిపల్ అధికారులు ఈఈ, ఎస్ఈని సంప్రదిస్తామని వివరణ ఇచ్చారు. 13వ అంశంగా ప్రవేశపెట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశంలో వివిధ అవకతవకలు జరిగాయని సభ్యులంతా సభ్యులంతా ముక్త కంఠంతో తిరస్కరించారు. ఈ మేరకు రూ.40 లక్షల విలువైన 14 పనులను రద్దు చేయాలని సభ్యులు సూచించారు. వెల్ల వాటర్ ప్లాంట్‌లో 1400 మొక్కలు నాటగా, అందులో ఎన్ని మొలకెత్తాయి. ఎన్ని పాడైపోయాయో అధికారులు అంచనా వేశారా అని కౌన్సిలర్ సాయిప్రసాద్ ప్రశ్నించారు. చనిపోయిన మొక్కల స్థానంలో కాంట్రాక్టర్ తిరిగి మొక్కలు నాటాలని అగ్రిమెంట్లో ఉందన్నారు. అలా చేయని పక్షంలో కాంట్రాక్టర్ ని రద్దు చేయాల్సి ఉందని వివరించారు. కాగా పాత బస్టాండ్‌లో సులభ కాంప్లెక్స్ నిరుపయోగంగా ఉందని దానిని ఉపయోగంలోనికి తీసుకురావాలని సాయి ప్రసాద్ సూచించారు. టిడ్కో ఇళ్లలో పారిశుద్ధ్యం క్షీణించిందని తక్షణమే అక్కడ పారిశుద్ధ్యం మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని కనీసం వారానికి ఒక్కసారైనా గ్యాంగ్ వర్క్ పెట్టాలని కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుని కోరారు.

పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ విజేతలకు సత్కారం



పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ విజేతలతో వైస్ ఎంపీపీ బాబీ, జిమ్ కోచ్ రామకృష్ణ తదితరులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 15న పి.గన్నవరం ఎస్ఎస్ ఫిట్నెస్ జోన్ వద్ద నిర్వహించిన ఉమ్మడిగోదావరి జిల్లాల స్థాయిలో పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ కాంపిటీషన్‌లో ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించిన ద్రాక్షారామకు చెందిన వీరభద్ర జిమ్‌కు చెందిన విజేతలను రామచంద్రపురం మండల వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ) ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. వెలంపాలెంకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ దొమ్మేటి నాగేశ్వరరావు ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించగా, బెంచ్ ప్రెస్ మాస్టర్స్ విభాగంలో ద్రాక్షారామకు చెందిన దవులూరి రామకృష్ణ నాగేశ్వరరావు(డీఆర్‌కే) ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్, బెంచ్ ప్రెస్ 64 కేజీల విభాగంల ఉప్పెల్లికి చెందిన సీహెచ్ దుర్గాప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్, 83 కేజీల విభాగంలో వెలంపాలెంకు చెందిన పిల్లి రాంబాబు ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్, అలాగే 93 కేజీల విభాగంలో అన్నాయిపేటకు చెందిన నక్కా భీమశంకరం(ఎన్‌బీఎస్) తృతీయ స్థానం సాధించి కాంస్య మెడల్ సాధించారు. వైస్ ఎంపీపీ బాబీ వీరికి నగదు పురస్కారాలు అందించారు. జిమ్ కోచ్ రామకృష్ణ, జిల్లా పవర్ లిఫ్టింగ్ వైస్ ప్రెసిడెంట్ గుడాల లక్ష్మీనారాయణలను కూడా దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అడవి కుమార్, తోట మామాలు, అడపా శ్రీను, చల్లా బుజ్జి, అనిశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సుఖ ప్రసవాలకు కృషి చేయాలి



ద్రాక్షారామ పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భవాని

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీల్లో ఆసుపత్రి అభివృద్ధి కమిటీల చైర్మన్ అంబటి భవాని అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను గ్రామ స్థాయిలో సక్రమంగా అమలు చేసేలా పీహెచ్‌సీల వైద్యాధికారులు కృషి చేయాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుఖప్రసవాలు జరిగేలా కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండటం వలన ప్రతి విలేజ్ క్లినిక్‌లలో ఓఆర్ఎస్‌లు, మంచి నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులైన సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, టేకుమూడి సుజాత, వీరబోయిన సూరిబాబు, పిల్లి అచల రాజశ్రీ, డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి, పీహెచ్‌సీల వైద్యాధికారులు వీవీ లక్ష్మీప్రసన్న, అలేఖ్య, టి.సందీప్‌నాయుడు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ చాగంటి అచ్యుతరామసుబ్రహ్మణ్యం, సీహెచ్‌ఓ వీరవేణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సాగునీటి ఎద్దడిపై రైతుల ఆందోళన



తుమ్మలపల్లిలంకలో నెర్రెలు తీసిన పంటపొలాల్లో ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

కాజులూరు: శివారు భూములకు సాగునీరందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు తదితరులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పలు గ్రామాలలో కౌలురైతు సంఘం నాయకులు పర్యటించి నీటిఎద్దడికి గురౌతున్న వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్యావటం శివారు తుమ్మలపల్లిలంకలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పొలాలకు పెదపూడి మండలం చితంపల్లి లాకుల నుంచి కరప మండల గ్రామాల మీదుగా సాగునీరు రావలసి ఉందన్నారు. అయితే ఇరిగేషన్ అధికారులు, నాయకుల అలస్యతం కారణంగా కాలువ శివారు భూముల్లో ఉన్న ఈ పంట పొలాలకు సాగునీరందటం లేదన్నారు. అధికారులు స్పందించి సాగునీటి సరఫరాలో కాలువ శివారు భూముల పొలాలకు ప్రాధాన్యతను ఇవ్వటంతో పాటు ప్రత్యామ్నాయ చర్యలపైనా దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో బాధిత రైతులు గీసాల బీమేశ్వరావు, పోలినాటి హనుమంతు, పోలినాటి కృష్ణ, గీసాల కొండయ్య, కాకరపల్లి విశ్వనాథం కౌలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు ఎంబార్‌కేషన్ వసతి కల్పించాలి

మండపేట: హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల కోసం గన్నవరం విమానాశ్రయంలో ఎంబార్ కేషన్ (ప్రత్యేక హజ్ శిబిరాలు) ఏర్పాటు చేయాలని టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మౌలానా కోరారు. సత్యశ్రీ రోడ్డులోని ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు విజయవాడ నుంచి సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఏపీ నుంచి 1630 మంది హజ్ యాత్ర చేపడుతున్నారని తెలిపారు. పొరుగు రాష్ట్రాల్లోని బెంగళూరు, హైదరాబాద్ విమానాశ్రయాల్లో ఎంబార్‌కేషన్ ఏర్పాట్లు ఉన్నాయన్నారు. దీని కోసం ఇప్పటికే అక్కడ ప్రత్యేక శిబిరాల ఏర్పాటు, సౌకర్యాలకు కోసం శాఖాపరమైన చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. కానీ మనం రాష్ట్రం నుంచి వెళ్లే ముస్లింలకు విజయవాడలో ఈ వసతి తీసివేయడం బాధాకరం అన్నారు. వెంటనే ప్రభుత్వం, మన రాష్ట్రానికి చెందిన పౌర విమాన శాఖ సహాయమంత్రి రామ్మోహన్‌నాయుడు స్పందించాలని కోరారు.

ఇమామ్ అలీకి ఘన నివాళి



ద్రాక్షారామలో నఖల్ ముబారక్ నిర్వహిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని ముస్లిం భక్తులు మహమ్మద్ ప్రవక్త సోదరుడు ఇమాం హజరత్ అలీ వర్ధంతిని మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రంజాన్ మాసంలో 19 వ రోజు ఇరాక్ దేశంలోని కుఫా మసీదులో తెల్లవారు జామున ప్రార్థన చేస్తుండగా విషం పూసిన ఖడ్గంతో శత్రువులు ఇమాం అలీ శిరస్సును ఖండించిన విషాద సంఘటనను తలచుకుంటూ గ్రామంలో మజ్లిస్, మాతం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి పంజేషా పంజాలో మజ్లిస్ అనంతరం ఆలం ఊరేగింపు నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం పంజాలో మజలిస్ అనంతరం నఖలే ముబారక్ (గుమ్మటం), ఆగావారి పంజా వరకు నిర్వహించి మాతం చేశారు. మర్షియా(విషాద గేయాలు) ఆలపించారు. మత గురువు మీర్జా అస్కరి హుస్సేన్ రంజాన్ నెలలో రోజా (ఉపవాసం), నమాజ్ చేయడంలో సూచనలు వివరించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భోజన వసతి కల్పించారు. అంజుమన్ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాట్లు పర్యవేక్షించాయి.

వెంటూరు వీఆర్వో దుర్గారావు మృతి



దుర్గారావు (ఫైల్)

రాయవరం: మండలంలోని వెంటూరు గ్రామ రెవెన్యూ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న రామదాసు దుర్గారావు శుక్రవారం రాత్రి మృతి చెందారు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ దుర్గారావు మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. వెంటూరులో సుమారు 40 ఏళ్ల క్రితం గ్రామ నౌకర్‌గా చేరి ప్రస్తుతం వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న దుర్గారావు రైతులందరికీ సహాయకారిగా ఉండడంతో పాటు, పంట శిస్తు వసూళ్లలో ముందుండేవాడని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. తహసీల్దార్ ఐపీ శెట్టి, తదితరులు వీఆర్వో దుర్గారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



ఉండూరులో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శంకరరావు

రామచంద్రపురం రూరల్: ప్రస్తుత సమాజంలో మహిళపై అఘాయిత్యాలు పెరుగుతున్న దృష్ట్యా వారు అప్రమత్తంగా ఉండాలని రామచంద్రపురం 13వ జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి ఎం.శంకరరావు అన్నారు. మండలంలోని ఉండూరులో గ్రామ సచివాలయం వద్ద రామచంద్రపురం మండల లోక్ అదాలత్ శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మైనర్ బాలికలు ఆకర్షణలో పడి అనేక ఇబ్బందులు పడుతున్నారని వారి రక్షణ కోసం 2012లో పోక్సో చట్టం ఏర్పాటు చేశామని ఆ చట్టంపై అవగాహన కల్పించారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ మాట్లాడుతూ క్రిమినల్ కేసుల్లో ఫిర్యాదుదారుడే కేసు నిరూపించుకోవాల్సి ఉంటుందని అయితే పోక్సో కేసుల్లో మాత్రం ముద్దాయి నిరూపించుకోవాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు దొమ్మలపాటి సత్యనారాయణ, ప్యానల్ లాయర్లు సన్నపు బాలసుబ్రహ్మణ్యం కుమారస్వామి, దుల్ల సత్యనారాయణ, బండి శ్రీనివాస్, చింతపల్లి శ్రీను, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్ రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్, విద్యార్థులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సత్యవతి

కాజులూరు: ఆర్యావటంలో శనివారం విద్యుత్ షాక్‌తో కళా సత్యవతి (60) అనే మహిళ మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. కరప మండలం వేలంగికు చెందిన పెంకే వీరామణి ఆర్యావటం శివారు బొక్కావారిపేటలో తన కుమార్తె నిర్మించుకుంటున్న నూతన ఇంటి వద్ద పని చేస్తుంది. ఈ సందర్భంలో గునపంలో మట్టిలో తవ్వగా మట్టిలో ఉన్న విద్యుత్‌వైరు కట్ అయి షాక్‌కు గురయింది. సమీప ఇంటిలో అద్దెకుంటున్న కళా సత్యవతి అది గమనించి వీరామణిని రక్షించేందుకు వెళ్లి అమెను పట్టుకుంది. దీంతో ఇద్దరూ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. సమీప గృహావాసాల వారు గమనించి విద్యుత్ ఫీజులు తొలగించి ఇద్దరిని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే కళా సత్యవతి అక్కడికక్కడే మృతి చెందింది. వీరామణి క్షేమంగా ఉంది. కాగా ఈ విషయంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని గొల్లపాలెం పోలీసులు తెలిపారు.